# వేడగోత్ర సంకెలు

ఉషశ్రీ

'డాక్టరుగారూ, నా బిడ్డను రక్షించండి. ఈ జన్మలో మీ మేలు మరిచిపో లేను. నా బిడ్డకు ప్రాణం పొయ్యండి. జన్మజన్మాలా మీకు కృతజ్ఞురాలినై వుం టాను. డాక్టరుగార్మా...నా బిడ్డ...... నా బిడ్డ...డాక్టరుగారూ'

ఇవే వాక్యాలతని చెవులలో ప్రతిధ్వ నిస్తున్నాయి. డాక్టరు డిగ్రీ పుచ్చుకొని వృత్తి ప్రారంభించిన యీ అయిదేళ్ళలో అతను చాలామంది రోగుల్ని చూశాడు.



వారి బాధలతోపాటు, ఆందోళనలూ గ్రహించాడు. ఆత్మీయుల ఆవేదనా రవాలూ అతని చెవిని పడకపోలేదు.

అందరినీ యేదోవిధంగా అనునయిస్తూ, ధైర్యం చెపుతూ, వారి రోగాలు కుదిర్చి పంపుతున్నాడు. ఆదిలో యీ వ్యవహారం కొంత కొత్తగావుండి వొకే రోగిదగ్గర గంటలు గడిపిన రోజులున్నాయి. ఒకోరోగిని విసుక్కుంటూ వచ్చేసిన సన్నివేశాలూ వున్నాయి.

తన విసుగుదల _ యెరిగిన తండ్రి రెండు, మూడు సార్లు హెచ్చరించాడు.

"నాయనా యీ వృత్తిలో రాణించాలంటే చిరాకూ విసుగుదలా పోవాలి. ఓరిమీ, శాంతమూ వుండాలి. ఈ రెండూ లేకపోతే నువ్వు యెంత ఘనవైద్యుడివైనా ఆ తెలివి పూర్తిగా నీ బుర్రకే పరిమితమై వుంటుంది.

"రోగానికి మందులకంటె వైద్యుడి ధైర్యవచనాలే యెక్కువగా పనిచేస్తాయి. నిజంగా మందులే పనిచేసేటట్లయితే వొకే రోగం యిద్దరికి తగిలినప్పుడు వొకే మందు ఆ యిద్దరికీ వాడితే వొకరికి తగ్గ



డానికీ, మరొకరికి విషమించడానికీ కారణం యేమిటి ?

"రోగాలకు భౌతిక కారణాలతోపాటు మానసిక హేతువులుకూడా వుంటాయి. నువ్వు మందు వాడేది భౌతిక హేతువుకే కాని మనస్సుకి కాదు. అందుచేత మాటలతో మనస్సుకి చికిత్స జరపాలి. మా తాతయ్య సంచికట్టు విప్పకుండా యెన్నో రోగాలు కుదిర్చేవాడు. ఆయన మాటలకు రోగి ఆనందంతో వెళ్ళేవాడు. ఎటువంటి రోగానికయినా ఆయన దగ్గర రెండే ఔషధాలు. నల్లమాత్రలు, ఎఱ్ఱ భస్మం...అంతే. ఆయన చేత్తో యిస్తే తెగులు తగ్గుతుందని వారందరికీ నమ్మకం. ఆ నమ్మకంతోనే వాళ్ళ రోగాలు తగ్గేవి. అర్ధరాత్రి రానియ్యి, అపరాత్రి కానియ్యి...ఎవరన్నా వచ్చి పిలిచారో విసుక్కోకుండా తక్షణం బయలుదేరి వెళ్ళేవాడు. రోగిదగ్గర అరగంటయినా కూర్చుని ఆమాటా, ఈమాటా చెప్పి ఉత్సాహం కలిగించి వచ్చేవాడు. వైద్యానికి ఆయువుపట్టు అదే.

"రోగికేకాదు రోగి ఆత్మీయులకు కూడా ఆ ధైర్యం కలిగించాలి. వింటున్నావా. లేకపోతే నువ్వు ఎటువంటి మందు ఇచ్చినా వాళ్ళు నీ వైద్యంమీద రోగికి అపనమ్మకం కలిగించేస్తారు. అప్పుడు రోగి మరీ నీరసపడతాడు. మానసికంగా దిగజారిపోయ్యేవాడికి నువ్వు యెన్ని మందులు వేసినా ప్రయోజనం లేదు.

"అందుచేత నువ్వు పేరు తెచ్చుకోవాలన్నా, నాలుగురాళ్ళు కూడబెట్టాలన్నా సహనం, శాంతం అవసరం"

అని ఆయన బ్రతికిఉన్నంత కాలం, సంవత్సరానికి రెండు, మూడు మార్లయినా స్మృతికి తెస్తూ ఉండేవాడు.

ఆ పారం బాగా వంటబట్టింది రంగారావుకి. తనతో చదివిన అమ్మాయిలలో సైతం లేని ఓరిమీ, శాంతమూ తన కలవాటవుతుంటే యితర మిత్రు లెందరో హేళన చేశారు. 'వీడు మరీ చప్పిడి మెతుకులు తినే మనిషి అయిపోయాడురా' అనేవారు. ఆ మాటలనుకూడా చిరునవ్వుతోనే స్వీకరించేవాడు.

క్రమక్రమంగా రంగారావు పెద్దల దృష్టిలో పడ్డాడు. వైద్యవృత్తిలో బాగా రెండుచేతులా సంపాదించుకునే అయిదారుగురు డాక్టర్ల దృష్టిలో అతనంత పెద్ద మనిషి కాలేకపోయినా యిరుగు, పొరుగు గ్రామాలనుంచి కూడా అతని దగ్గరకు రోగులు వచ్చిపోయే అలవాటుకూడా యేర్పడింది.

"మంచి డాక్టరమ్మా...ఆయన మాట చాలు తెగులు పోటానికి" అనే వాడుకకూడా పడింది.

ఎంత పేరు వచ్చినా రంగారావు డబ్బు విషయంలో నిక్కచ్చిగా ఉండలేక పోవడంవల్ల కొందరు ఇవ్వగలిగిన

వాళ్ళు కూడా మొండి చేతులే చూపించే వారు. ఇవ్వలేనివాళ్ళు సరేసరి. అలా జరిగిపోతున్నాయి రోజులు...

సరిగ్గా వారంరోజుల క్రితం జయంతి తన ఆసుపత్రిలో పురిటికి చేరింది. ఆమె కూడా యెవరూ లేరు. ఒక్కతే వచ్చేసింది. తనను గురించి చెప్పుకుంది. చెప్పుకొనేసరికి సిగ్గేసింది రంగారావుకి.

తనతో ఎనిమిదేళ్ళు కలిసి చదివిన జగన్మోహనరావు భార్య జయంతి.

తను డాక్టరు చదువుకి వెళ్ళిన రోజులలో జగన్మోహనరావుని విడిచేశాడు.

అంతవరకూ ఒకే కంచం, ఒకే మంచంగా బ్రతికిన స్నేహితులు ఇద్దరూ. అటువంటిది మళ్ళీ కలుసుకోనేలేదు. ఏవో ఉత్తరం ముక్కలు వ్రాసుకోవడమే గాని ముఖాలుకూడా చూసుకోలేదు.

ఇక్కడ ప్రాక్టీసు పెట్టిన రెండేళ్ళకు కాబోలు జగన్మోహనరావు శుభలేఖ పంపాడు. ఎంత వెడదామని ప్రయత్నించినా రోగుల పరిస్థితులు కదలనివ్వలేదు. శుభాకాంక్షలు పంపి ఊరుకున్నాడు. అంతే !

ఆ తరువాయి యిద్దరిమధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలే లేవు.

వాడెక్కడో విజయనగరం కాలేజీలో పనిచేస్తున్నాడు. తనేమో రాజధానీ నగరంలో వృత్తిలో పడ్డాడు. ఇంక కలియడమెలా. అక్కడికీ రెండు, మూడు మార్లు



"పిన్నిగారూ ! ఓ మారు మీ కత్తిపీట ఇవ్వాలట మా అమ్మ పట్రమ్మంది....ఆవకాయ పెట్తోంది....కాయలు తరగాలట,."

"అదేమిటే చిట్టీ.. మీ అమ్మ మొన్ననే ఓ కత్తిపీట కొనిందిగా. ! అది ఏమయిందేమిటి ?"

"మా కత్తిపీటతో కాయలు తరుగుతే మొద్దుపోతుందట అందుకని మీ క... పట్రమ్మంది మా అమ్మ."

---

విశాఖపట్నం వరకూ వెళ్ళి కూడా ఆ కాస్త దూరం వెళ్ళలేక పోయాడు.

జయంతి చాలా సిగ్గుపడుతూనే తను వచ్చిన పని చెపుతుంటే రంగారావు మరీ సిగ్గుపడ్డాడు. జగన్మోహనరావు మద్రాసు వెళ్ళబోయేముందు ఆ అమ్మాయిని తీసుకొచ్చి తనదగ్గర దిగవిడిచి వెడితే యెంత బావుండును అనుకున్నాడు. కాని సేవాధర్మం...అధికారుల ఆజ్ఞలు అలాంటివి. ఏం చేస్తాడు. అయినా ఆ అమ్మాయి భయపడకుండా రాగలిగినందుకు సంతోషించాడు. పెద్దనర్సుని జయంతికి రక్షణగా నియోగించాడు.

డాక్టరుగారికి అందరూ ప్రియమైన వారే అయినా జయంతిమీద ఆయన చూపిన శ్రద్ధ, అభిమానం చూసిన నర్సు కూడా ఆమె విషయంలో మరింత శ్రద్ధ వహించింది.

ఆసుపత్రిలో చేరింది మొదలు ఆమె మనస్సుకు ఉల్లాసం కలిగించడానికే నర్సు ప్రయత్నించింది.

వచ్చిన రోజున అంతా ఆమెను గురించిన వివరాలూ, విశేషాలూ తెలుసుకున్నది. రెండో రోజున ఆమె రుచులూ, అభిరుచులూ గ్రహించింది. క్షణం కూడా ఆమెకు మరే ఆలోచనలూ రాకుండా మంచిమంచి కథలు చెపుతూ, చక్కని ఊహలు నడిపిస్తూ, యెన్నెన్నో రుచులు తినిపిస్తూ, యేమేమో వేడుకలతో నడిపించింది.

రెండు, మూడు రోజులలో పురుడు వస్తుందనగా, "వాడేమనుకుంటున్నాడు, అమ్మాయి పుడుతుందంటాడా ! అబ్బాయి పుడుతుం దంటాడా ?" అన్నాడు రంగారావు.

సిగ్గుపడింది జయంతి.

తలవంచుకుంది, చూలింత.

బారజాచిఉన్న కాళ్ళు దగ్గరగా తీసుకుంది, నిండు చూలాలు.

'అంత సిగ్గు దేనికమ్మా, పోనీ నువ్వు ఏమనుకుంటున్నావో చెప్పు. అందరు అమ్మాయిలలానే నువ్వూ అబ్బాయి పుట్టా లనుకుంటున్నావా ?"

నవ్వుతూ పక్కనకు తిరిగి ప్రశ్నించాడు.

మంచంవార నిలబడిఉన్న నర్సు,

"పెద్దడాక్టర్లు మీరు చెపితే తెలుస్తుంది కాని మాకేం తెలుస్తుంది. ఆవిడ కోరిక ప్రకారం అబ్బాయి, ఆయన కోరిక ప్రకారం అమ్మాయి...యిద్దరూ పుట్టాలంట...కవలపిల్లలున్నారా అమ్మాయిగారి గర్భంలో"

అని నవ్వుతూ తన కడుపు తడుముకుంది. జయంతికి చచ్చేటంత సిగ్గేసింది. డాక్టరుకీ నవ్వొచ్చింది.

నర్సు మిగతా రోగుల విషయంలో యెలా ఉన్నా పురుడు పోసుకునేందుకు వచ్చే రోగుల విషయంలో మాత్రం యే మాత్రం యేమరుపాటు చూపదు.

ఆ విషయాన్ని గత రెండేళ్లుగా అతడు కనిపెడుతూనే ఉన్నాడు. ఆమెకు యెనిమిదోయేటనే పెళ్ళి కావడమూ, పదో యేడు రాకుండానే భర్త పోవడమూ కూడా జరిగిపోయాయి. ఆ తరువాత ఆమె మేనత్త తీసుకువెళ్ళి చదువు చెప్పించింది. ఎలాఅయినా డాక్టరు చదువు చదివించా లనుకుందిగాని ఆవిడకు ఆయుర్దాయం నిండిపోయింది. అత్తయ్య కోరిక తీర్చాలని తను నర్సుగా ట్రయినింగయి ఈ వృత్తిలో దిగింది. అదీ ఆమె కథ.

ఆమెకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే కోరిక కలగలేదు. ఒక బిడ్డ ఉంటే చాలు

ననే మూగ బాధ హృదయంలో యే మూలనో కలుక్కుమంటూ ఉంటుంది.

దానివల్లనే ఆమెకు పురిటికి వచ్చేవా రంటే అపారమైన ప్రేమ. వాళ్ళను కంటికి రెప్పలా చూస్తుంది. ఈ విషయం తెలిశాకనే రంగారావు ఆమెను తన ఆసుపత్రిలో జేర్చాడు.

జయంతికి పురుడు సునాయాసంగా రావాలని నర్సు వేయి దేవుళ్ళకు మ్రొక్కుకుంది. నర్సు వృత్తిలో గల అనుభవాన్ని బట్టి ఆమెకు పురుషయత్నం మీద కంటె దైవయత్నం మీదనే విశ్వాసం ప్రబలమైంది.

నలుగురు డాక్టర్లూ, ఎనమండుగురు అసిస్టెంటులూ, పదిమంది కాంపౌండర్లూ, నర్సులూ మంచంచుట్టూ నిలబడినా రోగి రోగానికి శాంతి చెయ్యగలరేకాని ప్రాణాన్ని నిలబెట్టలేరు. ప్రాణ దానం చెయ్యడమనే శక్తి మనిషి చేతులో లేదు. ప్రాణాన్ని పరమేశ్వరుడి దగ్గర దానం పుచ్చుకుని వచ్చినమనిషి దాన్ని దానం చెయ్యడం అసంభవం. అందుచేతనే దైవబలం కూడి వస్తేనే ఈ మానుష యత్నం ఫలిస్తుందని ఆమె విశ్వాసం.

ఈ విషయం రెండుమూడు సార్లు రంగారావుకే చెప్పింది.

రంగారావు తండ్రి పోయినప్పుడు ఈ మాటలతోనే అతనికి ఉపశమనం కలిగించింది.



“ఏమయ్యా, నాలుగు గుడ్డలు ఇన్ని రోజులకా తీసుకొచ్చేది?”
“సరిగ్గా ఇదేమాట ఇవి నావద్దనుండి అద్దెకు తీసుకున్నవాళ్ళ నడిగాసార్.”

వారంరోజుల క్రితం జయంతికి పురుడొచ్చింది. బిడ్డ పుట్టిన క్షణంలోనే ఆఖరు శ్వాస తీసుకున్నాడు. ఆ రోజు నుంచీ జయంతిని పట్టడం కష్టమవుతున్నది.

ఆరోజున అహోరాత్ర దీక్షగా నర్సు లోపల్లోపల బాధపడుతూనే జయంతిని ఓదారుస్తూ కూర్చున్నది.

ప్రసవవేదనకంటె పుత్రశోకం దుర్భరమైంది.

జయంతి ఒక ఘడియ కన్ను మూస్తే ఆ ఘడియలోనూ నర్సు వెనుదిరిగి కూచుని కంట నీరు పెట్టేది. మాతృత్వం అనుభవంలో లేకపోయినా మాతృ హృదయావేదన చూస్తూనే ఉన్నది. కనీసం తనకు అటువంటి యోగమయినా పడితే బావుండు ననుకున్న క్షణాలు లేక పోలేదు.

మెలకువ వచ్చినప్పుడల్లా జయంతి బిడ్డకోసం కలవరిస్తూనే ఉంది. అసు

పత్రిలో మిగిలిన రోగు లందరికీ మొదటి రెండు, మూడు రోజులూ అంత బాధ అనిపించలేదు కాని రానురాను వారికి కొంచెం విసుగు కలగడంతో రంగారావు ఆమెను తన యింటికే తీసుకురమ్మన్నాడు.

నర్సుకూడా వచ్చింది. ఆమెకోసం కేటాయించిన గదిలో అన్నీ అమర్చాడు కాని, పాపం డాక్టరు ఆమె యెంతో సరదాగా తెచ్చుకున్న కుక్కపిల్ల బొమ్మ అక్కడనుంచి తీసెయ్యడం మరిచి పొయ్యాడు.

జయంతి వచ్చిన రోజునే ఆ బొమ్మ తన బిడ్డకు ఆడుకునేందుకు కొనిపెట్టమని నర్సుతో చెప్పింది. నర్సు మరునాడే తెప్పించింది. బిడ్డ పోయిన మరునాడు ఆ కుక్కపిల్ల బొమ్మకూడా కనిపించకుండా చేసింది, ఇక్కడ కొచ్చేసరికి జయంతి దృష్టి దానిమీద పడింది. ఆరోజల్లా జయంతి కుక్కపిల్లను విడిచిపెట్టలేదు. ఆమెచేత రెండు మెతుకులు కతికించడం కష్టమైపోయింది నర్సుకి.

డాక్టరు రంగారావు హృదయం మరీ కుమిలిపోతున్నది. తనమీద విశ్వాసంతో వాడు పంపాడు. విశాఖపట్నంలో సౌకర్యాలు లేక కాదు, వాడికి తెలిసినవాళ్ళు వుండకనూకాదు. తానయితే శ్రద్ధగా, బాధ్యత వహించి స్వయంగా జాగ్రత్తగా పురుడు పోయించి పంపుతాననని నమ్మాడు. నమ్మి మరీ పంపాడు.

ఇప్పుడేం చెయ్యాలి. తన లోపమేమీ లేదు. నర్సుకూడా కంటికి రెప్పలా, కన్న కూతురులా చూసింది.

అయినా...

వాడికేం జవాబు చెప్పను ?

వాడు రేపు వస్తున్నాడు !

ఈవిడ యింకా తను కనిపిస్తే చాలు.......

"డాక్టరుగారూ — నా బిడ్డ" అంటూనే వున్నది.

కడుపు తరుక్కు పోతున్నది......

గుండె బ్రద్దలయి పోతున్నది......

విశ్వప్రయత్నంమీద నర్సు ఆమె దృష్టిని మరలించ గలుగుతున్నది.

"ఆయన వస్తారమ్మా. వచ్చేసరికి మీరిలానే వుంటే ఆయనేం కావాలి. మగవాడు ఆడదానికంటే దుర్బల హృదయుడు. మీరేయింత బెంబేలుపడి గాబరా అయిపోతే ఆయన మరీ జారిపోతారు. మీరు నిబ్బరంగావుండి ఆయనకు ధైర్యం చెప్పాలి. అయినా — చెట్టున కాసిన కాయలన్నీ దిగుతాయా. కొన్ని రాలిపోతాయి. కొన్నివడిలి పోతాయి. మంచికాయలు మిగులుతాయి. అదీకాక కాపుపట్టే చెట్టు వుండగా కాయ రాలిందని బాధ పడవచ్చునా — అనేవాడు మానాన్న.

మళ్ళీ యీనాటికి మీరుయిక్కడే గుమ్మడి పండంటి బిడ్డను యెత్తుతారు"

అనినర్సు ఆశ్వాసన యిచ్చేసరికి జయంతి హృదయం తేలికపడింది. ఆమె ముఖం వికసించింది. ★